## ఉగాది కథల పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన కథ


యుక్త వయసులో ఉన్న ఓ ఆడపిల్ల తండ్రిగా పట్టు పరికిణీలు కుట్టించగలను. వాటికి దీటైన పావడాలు తెప్పించగలను. సొమ్ములు పెట్టి చూసుకుందును.

, కానీ... పైట సర్దుకునేటప్పుడు తన చూపెటుందోనని పరికిస్తా నెందుకు? ఆ వెండి పట్టాల అడుగులు తడబడుతుంటే ఝుల ఝులమ్మంటున్న తన మనసుని పరిశీలిస్తా నెందుకు? తను నిద్రలో నవ్వుకుంటుంటే ఆ కలలకు అరాలు తీస్తూ నాకు నిద్రే పట్టదు ఎందుకు?

నే నో తల్లిగా పుట్టినట్టయితే ఎంత బావుండేది!

వసువు రాస్తూనో...తలంటి పోస్తూనో.. చిక్కు తీస్తూనో.... ఆ చిలిపి చూపులు చిక్కించుకుని అడిగి ఉండేదాన్ని: ఎవ రా అబ్బాయని ఏంచేస్తుంటాడని, నీకు నచ్చాడాని?

ఆ సిగ్గును తనతో వంచుకునేదాన్ని: ఆ ఉగ్గుపాలు నావేనన్న ఆనందంతో అక్కడే హత్తుకుని, మళ్ళీ తనని కనవలసినంత ఉత్సాహంతో కౌగలించుకునేదాన్ని: కన్నంత



వేదన, ప్రేమ కలగలిపి ముద్దెట్టుకునేదాన్ని.

కానీ... నేను తండ్రిని.

ఎవ రా అబ్బాయని... అతని పేరు వినలేను. ఎక్కడ అతన్ని మొదట చూశావని... తల దించుకు చూడలేను. నీకు నచ్చాడా అని అడిగి... నాకు చెప్పలేక కాలి బొటనవేలితో నేల మీద గీస్తున్న గీతల్లో అర్థం చేసుకోలేను.

ఏం చేస్తుంటాడో నాకు తెలుసు- ప్రస్తుతం ప్రేమిస్తున్నాడు.

అబ్బా! నన్ను 'నాన్నా" అనకపోతే నా కీ బాధ ఉండేది కాదు. అంటున్నది కాబట్టి అది తప్పడం లేదు. ఏమి టీ తండ్రి కింత దౌర్భాగ్యం! మరేలా అయితే ఎంత బావుండేది!

స్వంత చేతుల్తో కల్యాణ తిలకం దిద్ది ఉందును. మధుపర్కాల ముడి బిగువుకి మడత పడుతున్న పైటని భుజాల మీదుగా సవరించి ముసిముసిగా నవ్వుకుందును. ఆ గదిలో ఎలా నడుచుకోవాలో, నడవలేక తడబడుతున్నపుడు ఆసరాను ఎలా చేరుకోవాలో చూపించి ఉందును. దగ్గరైపుడు తన ముఖాన్ని ఏ సిగ్గుతో హత్తుకోవాల్నో చెవిలో చెప్పి ఉందును. తనతో అలా నవ్వుకుందును. ఆ నవ్వులో నన్ను నేను మరచిపోయి ఉందును. ఆ వేకువ దాకా అలా మేల్కొనే నిద్రపోయి ఉందును. తను అలసిపోయి వచ్చి నా వక్కనే కాస్తంత ఒత్తిగిలినప్పుడు ఆ అలసట తీరేట్టు ఓ సారి కౌగిలించుకుని ఆనందంతో హాయిగా ఏడ్చి ఉందును.

కానీ... అలా ఉండలేను. నేను స్త్రీని కాను. నా స్థితిని ఊహించలేను. నన్ను పోల్చుకోలేను. నన్నూ నా స్థితిని నేనే సహించలేను. అరుణని... ప్రేమించ...నివ్వను.

నే నతన్ని అసలు చూడనే లేదు. కానీ... ఎందుకో అతనంటే నా కింత కోపం, 'కసి'! నన్ను నేను మరచిపోతున్నంత వరాకు. అన్నీ ఇక గుర్తుండవేమోనని చిరాకు.

ఈ వరాకు, చిరాకు... ఎదురుగా- వాలుగా నా మనసుని పదును బెడుతున్న ఓ పిడిలేని అకురాయి!

హృదయంలో ఆ పదు నెంతో చూసుకోబోతే... అక్కడ రాల్తున్న మిణుగురు పురుగుల్లాంటి రవ్వలకి గిలగిల్లాడుతూ గగ్గోలు పెడుతున్న ఓ మగ కీచురాయి!

అతన్ని నువు చూడలే వంటున్నది. నువ్వేం చేస్తావో చూద్దాంలే అంటోంది. ఇంతకీ... ముం దత నెవరో తెలుసుకోమంటోంది.

* * * * *

నడుం మీద నీళ్ళ బిందెతో ఉమ వస్తోంది. ఉమా, అరుణా చిన్నప్పట్నుంచీ ప్రాణ స్నేహితులు.

ఎదురుగా వెళ్ళాను. నిలబడ్డాను.

ఉమ తడబడింది. నిలబడింది.

నేనేమీ అడగలేదు. ఉమకి అర్థమయింది.

తనేమీ చెప్పలేదు. ఓ సారి అలా చూపు సారించి అక్కడ నిలిపింది. సాక్షి అనిపించుకుంది.

ఆ చూపు ఆగిన చోట దూరంగా అతను నీళ్ళ కావిడితో లయగా అడుగులు వేస్తూ వెళ్తున్నాడు.

నేను అడ్డు తొలిగాను. ఉమ తల వంచుకుని ముందు క్కదిలింది. వెంటనే ఓసారి వెనక్కి తిరిగింది.

ఆ భయం పోగొట్టడానికి నేను ఓ చిరునవ్వును వెంటనే బలి చేయాల్సి వచ్చింది.

* * * * *

ఓ గది- వెనక వంటగది.

కింద కూర్చుని- పీట ముందెట్టుకుని దాని మీద చాకుతో ఉల్లిపాయలు తరుగుతున్నాడు. ఒలుస్తున్న పై పొరల్ని పక్కనున్న పాత చాక్పీసుల పెట్టెలో భద్రంగా వేస్తున్నాడు. రేడియోలో వినిపిస్తున్న రాగానికి తలూపుతున్నాడు.

నేను దగ్గాను.

చొక్కా లేని అతను కంగారుగా లేచి తువ్వాలు కప్పుకోవడంలో నా కో కవచం దొరికింది.

నే నసలు వేషం తీసేసిన రావణాసురుడిలా ఉంటా నంటారు. పక్క చెంపల్లో కలిసిపోయిన నా మీసాల గుబురు చూసి జడుసుకున్నట్టున్నాడు. నాలో ధైర్యం నిండుకుంది.

రేడియో తగ్గించబోయి ఆపాడు. ఆ 'శ్రీరాగం' ఆగి నా గొంతుకు శ్రుతి దొరికినట్టయింది.

"నమస్కారం... రండి... కూర్చోండి" అంటూ కుర్చీ వాల్చాడు.

నేను ఠీవిగా కూర్చోలేకపోయాను. కూర్చున్నాక దాని సంగతి ఆలోచించవచ్చులే అనుకున్నాను.

నాకేమీ సహకారం లేని పరిస్థితి. ఆ 'శ్రీరాగం' నాకు తోడే గదా ననిపించి "రేడియో ఆపేశా వెందుకు? ఉంచు- పరవాలే"దన్నాను.

"లేదండీ... అదంతే. ముట్టుకుంటే అలా అపుడపుడూ ఆగిపోతుంది" అన్నాడు, దాన్ని ముద్దుగా చూసుకుంటూ.

నేను నిట్టూర్చి, "నన్ను గుర్తించినట్టున్నావు..." అన్నాను.

తల ఊపాడు అవు నన్నట్టు.

"ఎలా?"

"పోలిక"! నిజం చెప్పేడు.

మా చూపుల్ని ఆ పోలిక దగ్గరకు చేర్చిందేమో- ఇక మొదలెట్టాను- "నేను వచ్చిన పని చెబుతాను."

"చెప్పండి" అన్నపుడు అతని బొడ్డు ఇంకా గుంట పడింది. ఓ గుటక పడినట్టు గొంతు విచ్చుకుంది. కానీ రెప్ప పడలేదు.

"అరుణ అమాయకురాలు అని అనను. కానీ తల్లి లేనిది. ప్రపంచం అంతగా తెలీదు."

అతను తల ఊపుదా మనుకుని వంచాడు.

"నేను కొంచెం నిష్ఠ గల వాడిని."

తల ఎత్తాడు అదేవిఁటో చూద్దామని.

"నిష్ఠంటే ఏమీ లేదు. ఎవరికీ కష్టం కలుగజేసి ఎరుగను. ఇపుడు నీ ఇష్టానికి ముందుగా నా మనసే కష్టపడుతోంది గనక... నీకు క్షేమం కాదు."

అతని రెప్పలు అల్లల్లాడాయి.

"నే నేమీ చేయను. కేవలం ఏడ్వగలను. కానీ... దాన్ని అరుణ తల్లి ఎత్తుకు పోయింది. నీ సంగతి చెప్తే తిరిగి ఇస్తుందేమో! ఇక ఆ కన్నీటి బొట్టును అవసరమైతే ఆపలేను. అదే నీకు క్షేమం కాదు. అర్థమైందా?"

అయినట్టు అతను తల ఊపాడు. అంత వరకూ అతను చేతులు కట్టుకునే నిలబడి ఉన్నాడు.

వెళ్ళి... పాత రేకు ట్రంకుపెట్టె మీద ఉన్న పక్క గుడ్డలు పక్కన పెట్టి, కీచుమంటున్న మూత తీసి- ఓ కవరు బయటికి తీశాడు.

కూర్చున్న నా విశాలమయిన ఒళ్ళో ఆ కవరు ఉంచి వణుకుతున్న చేతుల్తో నమస్కరిస్తూ అన్నాడు- "నేనుగా ఏమీ చేయలేదు. అందుచేతనే మీరు నన్ను కొట్టలేదు. తిట్టలేదు."

రైపు బాగున్నది.మాటలు సొంపుగా ఉన్నాయి.

"నాకు క్షేమ మంటేనే ఇష్టం. నా క్షేమ సమాచారాలు రాయమని మా అమ్మా, నాన్నా రాస్తుంటారు. న న్నింకేమీ అడగరు."

నా ప్రిపరేషను కూడా అదే గదా!

"ఈ కవర్లో... ... రాసిన మూడు ఉత్తరా లున్నాయి."

ఆ యూనిట్ టెస్టేమిటో నాకు అర్థమయింది.

"మీరు...తండ్రి గనుక ...అమాయకురాలు 'కాదు' అన్నారు. ఇవి చదివి నేను 'అవును' అని



అనుకుంటున్నాను. అందుచేత తనకి నేనేమీ వ్రాయలేదు."

అది నాకు జవాబులాగే వేసిన ప్రశ్నా? అయితే ఏమీ అర్థం కాలేదు.

కాసేపు మౌనంతర్వాత అన్నాడు, తల దించుకుని- "తనని ఇలాగే మందలించండి. ఏమీ చెయ్యవద్దు."

నాకు ఛాయిస్ తెలీడంలేదు. నాదే కాదు- తనది కూడా.

"మరొకసారి నన్ను మీ నిష్ఠతో ఆశీర్వదించండి" అంటూ నా పాదాలని తాకాడు.

పరీక్ష హాల్లోంచి బయటి కొచ్చినట్టనిపించింది. పేరు అడగడమే మరిచిపోయాను. అడిగాను.

"శంభుదాను- కానీ శంభు అంటారు. బెస్తపాలెంలో టీచర్ని."

"ఏ ఊరు?"

"అద్దంకి... ప్రాంతంలో ఓ చిన్న పల్లెటూరు."

చాలా దూరం వచ్చాడు పావం. ఆ ఊరి దాపుల్లోని ఆంజనేయ స్వామి గుడికి నా బాల్యంలో వెళ్ళినట్టు గుర్తు. సముద్రం దూకినంత ఉత్సాహంతో లేచి బయల్దేరాను.

నా వెనగ్గా అలికి డయితే వెనక్కి తిరక్కుండా ఆగాను. ఎదురుగా వచ్చాడు. నా గడ్డం వేపే చూస్తూ ఓ నన్నటి చిరునవ్వు అలా తెరిచి ఇలా మూసేశాడు.

అతగాడు టీచరు గనుక నా గడ్డానికున్న అదే లక్షణం గమనించిన ట్టున్నాడు. నా గుబురు బుర్ర మీసాలు మనుమల్ని నిలబెడితే... గడ్డం కూర్చోమంటుంది. చిన్నప్పుడు అక్షరాలు దిద్దుకునే రోజుల్లో మా టీచరు కూడా "దయ"లోని "ద" ఎలా రాయాలో- నా గడ్డాన్ని... మధ్యలో ఆ నొక్కునీ పిల్లలకు చూపించి రాయించేవాడు.

కుడి చేత్తో మీసాల్ని గంభీరంగా దువ్వాను.

నే నక్కడ మరిచిపోయిన ఉత్తరీయం అందిస్తూ అన్నాడు, తల వంచేకునే- "దయ చేసి.... దయచేసి...మీ రేమనుకోకపోతే... అరుణను నా ముందే మందలించండి. అప్పుడు నేను కూడా ఉంటే... మీరు కొట్ట లేదని నమ్ముతాను."

"నేను....కొట్టానని ఎందు కలా అనుకుంటున్నావ్?"

"మీ అమ్మాయే గనుక..."

అతను న న్నెక్కడ కొట్టాడో ఎంతకీ తెలీలేదు. హింస చేయవద్దంటూనే న న్నిలా వెంటనే చంపాడేవిఁటి?

"ఏం నాన్నా... అలా ఉన్నావ్... కాస్తంత కాళ్ళు పట్టనా?"

"వద్దు." - అత నెవరో నా కంటె బలవంతు డనిపిస్తోంది.

"పోనీ... కాఫీ పెట్టనా?"

"అక్కర్లేదు."- నా కంటె నిష్ఠ గలవాడా అని భయ మేస్తోంది.

"అయితే ఇంకేం. అమ్మ గుర్తొచ్చిం దన్న మాట!" అంటూ నవ్వి, అమాంతం అంతలావు నా ముఖాన్ని తన చిన్న చేతుులతో పట్టుకుంది. మంచమ్మీద పక్కలో కూర్చుంది.

నహించలేక...అదంతా నహించలేక ఏడ్చాను

అది దిగులేమో ననుకుని... "పిచ్చి నాన్నా నన్ను 'తల్లీ' అని పిలూస్తూనే ఉన్నావు. పలుకుతూనే ఉన్నాను. ఎప్పుడూ లేనిది ఇలా ఏడుస్తున్నావంటే... నీ కిప్పుడు నిజంగా ఆకలయిం దన్నమాట! తప్పు నాన్నా... నా బంగారువి కదూ!"

ఇదివరకటి లాగా నేను ఇక చేతుల్లోకి తీసుకోలేను. తీసుకోవాలనే ఉంది. అవి ఎంతకీ రావు.

"ప్చ..." అంటూ లేచి, "ఏఁటో...ఈ రోజు అదోలా ఉన్నావు," అని, ఆలోచన ఏదో వచ్చినట్టు తల పంకించి, "ఆఁ, అన్నట్టు ఎలా ఉన్నావో చెప్పనా?" అంది నవ్వుతూ.

"ఎలా ఉన్నాను?" ఆ ఏడుపంతా మరిచిపోయి ఎంత వేగంగా అడిగానో!

"మీ అన్నగారితో పడలేక... తిన్నగా ఆ రాముడి దగ్గరికెళ్ళి... ఆయన చేతుల్లోనో... భుజం మీదనో ఏడుస్తున్న విభీషణుడిలా ఉన్నావు."

"ఎవరు చెప్పా రమ్మా... నీ కీ ముద్దు ముద్దు మాటలు?"

"మీ ఆవిడ" అంటూ నవ్వుతూ ఉత్తరీయం తీసి మడవ బోయింది.

అప్పు డా కవరు కింద పడ్డట్టయింది. తీసి చూసుకున్నట్టుంది.

నన్ను చూసే ఉంటుంది. నేను చూడలేను. ఆ పాటికే గట్టిగా కళ్ళు మూసుకున్నాను.

"వీటిని నువు తెచ్చుకున్నావా నాన్నా?"

ఆ కోపం నాదే- చక్కగా అప్ప చెబుతోంది.

"లేదు- అత నిచ్చాడు."

"అదే... అడిగి తెచ్చుకున్నావా- అని?"

నేను కళ్ళు తెరవలేదు. అలాగే అన్నాను- ఊహుఁ. ఎందుకు?"

"అంతగా కావాలనుకుంటే నీకూ ఓ ఉత్తరం రాసి ఉందును గదా..."

"ఏమని?"

"అమ్మని వెంటనే తెమ్మని". గాద్గదికంగా అంటూ కింద చతికలబడ్డట్టుంది.

నా చేతులు పట్టుకుంది. తన ముఖానికి కప్పుకుంది. అవి వెచ్చగా- తడిగా. ఏడుస్తోంది.

"అమ్మని మరపించి పెంచాను గదా- ఎందు కమ్మా న న్నిలా ఏడిపిస్తావ్?"

"సారీ నాన్నా..."

"ఏఁకావాలో చెప్పు." ఏడుస్తున్న పిల్లలకు వెంటనే తల్లిదండ్రు లిచ్చే వరం ఇదేగా!

"చెప్పేస్తాను. నువ్వే... నువ్వే అమ్మ వనుకుని అంతా చెప్పేస్తాను."

"అలా అన్నావు బావుంది. అమ్మలాగే వింటాను. మొదట్నుంచీ... కానీ నిజం చెప్పాలి! "అంటూ మంచం మీదనే నేను తనవేపు తిరిగి, తన కళ్ళు తుడిచాను.

నర్దుక్కూర్చుంటున్న తను పైటతో ముక్కు తుడుచుకుని ముక్కుపుడక సీలను బిగించుకుంటూ, నన్ను అలవోకగా చూడాల్సి వచ్చి ఒక నవ్వు నవ్వింది.

వాళ్ళమ్మను ఎంత అందంగా జ్ఞప్తికి తెప్పించింది?

"అనలపుడేం జరిగిందంటే... బెస్తపాలెం మీదుగా నేనూ, ఉమా వస్తున్నాం. సముద్ర స్నానాలకి వెళ్ళేంగదా- ఆ రోజన్న మాట!"


వింటున్నాను.

"మా ముందుగా ఓ బండి వెళ్తోంది. బండి నిండా వడ్ల బస్తాలు. ఇనుకలో ఆ బండి అనలు కదలడం లేదు. బండి వాడేమో అరుస్తూ చర్నాకోలతో ఛెళ్ ఛెళ్ మనిపిస్తున్నాడు.

"అప్పు డా తడికిల బండిలోంచి అత నొచ్చాడు. మమ్మ ల్నసలు చూళ్ళేదు. బండి ఎదురుగా వెళ్ళి నిలబడ్డాడు. మేం పక్కకి జరిగి నిలబడ్డాం.

"అత నలా బండి ఎదురుగా నిలబడి, కాడి పట్టుకుని ఆపి... బండి అతనితో అన్నాడు గదాఉ- 'బాబూ, ఈ ఎద్దు ల్నిలా కొట్టవద్దు. నీకు దణ్ణం పెడతాను." ఎంతో దీనంగా! జాలిగా దేవుడి గుళ్ళో లాగా అడిగాడు.

నాలుకతో పెదాలు తుడుచుకుంటున్న అరుణ అలాగే నేను చెప్పిన కథల్ని మళ్ళీ చెప్పడం



తెలును. "ఆ తర్వాత?" అన్నాను.

" ఆ బండివాడేమో.... నీ కంటే పెద్దవాడే- పోనీ నీ అంత ఉంటాడనుకో- అవాక్కయిపోయి... ఆ జాలి కురిపించే మాటలకి ఏడ్చేశాడు. నిజంగా నన్నమాట. 'ఏంచేస్తాను బాబూ- నాకూ కొట్టాలనిపించదు. పొట్ట కూటి కోసం' అంటూ పొట్ట చేత పట్టుకున్నాడు.

"వెంటనే అతనేమో జేబులు తడుముకుని- అయ్యో'- అని ఎదురుగా కన్పిస్తున్న మా దగ్గరికొచ్చి - 'ఎంతుంటే అంతివ్వండి- సాయంత్రం తెచ్చి ఇస్తాను", అంటూ చెయ్యి చాపుతూనే అడిగా డన్నమాట.

"నాకు తెలీకుండానే అయిదు రూపాయల నోటు కట్టి ఉన్న కర్చీఫ్‌ను అలాగే ఇచ్చేశాను. అతను తీసుకుని దాన్ని అలాగే బండి వాడి కిస్తూ తీసుకో- కానీ వీటిని కొట్ట వద్దు' అంటూ ఆ ఎద్దుల చెంపల మీద చెయి వేసి- ఇకపోతే గంగడోలు కూడా నవరించి- వెనగ్గా వచ్చి బండిని నెట్టాడు. బండి కదిలింది. ఇంతలో బండిలోంచి పిల్లలందరూ వచ్చి బండిని నెడుతూ మెరక దించారు."

"ఆ తర్వాత?"

"గుర్తొచ్చినట్టు చూసి 'మీరు ఎక్క డుంటారు? సాయంత్రం పిల్లల చేత పంపించవచ్చుగా?' అన్నాడు"

"అదంత చూసి నేను అదోలా అయిపోయాను. నాలో ఏదో అల విరిగి శరీరమంతా పరుచుకున్నట్టయింది. వక్కనున్న ఉమని చూశాను. అదీ అంతే!

"అలాంటపుడు అంత చిలిపిగా ఎలా అడిగానో గాని, నాన్నా ఇప్పటికీ నవ్వొస్తుం దన్నమాట" అంటూ నవ్వి చెప్తోంది, 'ఎంత పంపిస్తారేమిటి?' అన్నాను."

"అవునవును- అన్నట్టు దాంతో... ఆ కర్చీఫ్‌లో ఎంత ఉందీ?" అని అడిగాడు సిగ్గుపడుతూ.

"అపుడు నే నన్నాను గదా- 'పోనీ లేండి... దా న్దేవుందిలే. ఆ వడ్ల బండి మా ఇంటికే గదా వెళ్తోంది' అన్నాను. ఓ పోజు కూడా పెట్టాను."

అది నే చూడ్డం లేదు. ఒకప్పుడు మా ఇంటి పేరుతో చెప్పుకునే ఆరు అరకల పొలం కన్పిస్తోంది. తాతయ్య బండిమీద తెచ్చి, నా చేతులతో విప్పించి ఎద్దులకు పెట్టిస్తున్న తాటి బెల్లం తాటాకు బుట్టల చప్పుడు వినిపిస్తోంది. 'బలరాము'డనే మా అబోతు బెల్లం తింటూ, బుస కొడుతూ వెండి మొలతాడే ఉన్న నన్నంతటా నాలుకతో గరుకుగా తడుముతుంటే ఇప్పుడే చక్కలిగిలి పెట్టినట్టుంది.

అరుణ ముఖాన్ని నా రెండు చేతులతో పట్టుకుని పాపట మీద ముద్దెట్టుకున్నాను.

చాలా ఫ్రీగా నవ్వింది అతన్నీ నన్నూ ఒకేసారి జయించినట్టు. అంది- "ఏఁటి నాన్నా ఇంకా ఆలోచిస్తున్నావ్?" అన్నాను- "అత న్నిక్కడికి పిలిపిస్తున్నాను." మందలించడానికని తన కేం తెలును? నా విజయోత్సాహం అప్పుడే ఎందుకు?

"చెప్పవేం మరి?" అంటూ ముద్దుగా పళ్ళు కొరుకుతూ పక్కలో కూర్చుంది.

టాపిక్ మార్చాలని కాదు- ఆ నిజం కూడా తోడుగా ఉందేమో? అలా అయితే నాకు మరీ నులువని అడిగాను. "అది నరే.... నీ వక్కనే ఉమ కూడా ఉంది కదా... మరి... ఉమ... అతన్ని?!"

"అర్థమయిందిలే- ను వ్వెవ్వరికీ చెప్పకపోతే చెప్తాను."

"ఒట్టు."

"ఉమకి కూడా..."

"ఉహుఁ."

అంటే.. నేను ఉమతో చెప్పలేకుండా ఉండలేక పోయా నన్నమాట. అంటే.... అనలేం చెప్పలేదులే- ఏమన్నానంటే... 'ఇంత మంచి వాణ్ణి చూశావంటే?' అడిగాను.

'ఇక చూడనేమో కూడా' అంది తను.

"ఏఁ పెళ్ళి చేనుకోరాదా? రోజూ చూనుకోవచ్చు." అన్నా న్నేను.

"అదేమో... సిగ్గుతో నా నడుం మీద చెయ్యేసి ఒక్క గిల్లు గిల్లింది. అబ్బా అన్నాననుకో ఆ... మా... నవ్వుల్లో అంది కదా- కొట్టేశావులేవే- ఆ రోజున ముందుగానే బయనా లాగా ఏదో తాయిలం ఇచ్చుకుని మరీ కొట్టేశావు గదా!

"నా కింక మహా సిగ్గు వేసి- దాన్ని ఎక్కడ గిల్లుదామా అనుకుంటూంటుంటే పరుగెత్తింది."

"అలాగా"... అన్నా న్నేను ఆ ఆడపిల్లల మనసులో ఒకడినైపోయి.

"ఉండు- వినుమరి. బావి దగ్గర ఓ రోజు వెన్నెల్లో నీళ్ళు తోడుకునేప్పుడు అంది కదా.... 'ఒక వేళ నువు పెళ్ళాడితే- మీ ఆయన్ని... ఓసారి నన్నూ ముట్టుకోనివ్వవే... ప్లీజ్' అంది.

"నే నిక అపుడే తోడిన బిందెలోని నీళ్ళని ఓ దోసెడు దాని ముఖాన చల్లాను" అని గట్టిగా ఊపిరి పీల్చుకుని కాసేపాగి అంది" అబ్బ! ఉమ ఎంత మంచిదంటే నాన్నా.. గోల్డన్న మాట!

"ప్చ్... దానికి పెళ్ళయినా, నాకు పెళ్ళయినా... ఇద్దరం విడిపోలేక ఇక కలసి ఏడవాల్సిందే... తప్పదు, అంటూ ఆ ఛాయలు కళ్ళల్లో మెదిలినట్టు రెపరెపలాడించి తల విదిలించింది.

అంది ప్రాధేయ పడుతున్నట్టు- "అత న్నిక్కడికి పిలిపించిన్నాడు నాకు తోడుగా ఉమని కూడా రమ్మంటాను, నాన్నా... ప్లీజ్...!"

"అ...లా...గే..."

"అబ్బ. నువ్వే ఇంత అలసి పోయావే... ఇదంతా విని నువ్వే నాకు కాఫీ ఇవ్వాలి"అని వెంటనే నాలు క్కరుచుకుని- "కాఫీ తెస్తాను" అంటూ కంఠం చుట్టూ పట్టి ఉన్న చెమటను పైటతో తుడుచుకుని, మళ్ళీ నేర్డుకుని వంట గదిలోకి వెళ్ళింది.

కాఫీ ఇస్తూ అడిగింది- "అత న్నెప్పుడు రమ్మన్నావూ?"

"ఇంకా చెప్పలేదు" అన్నాను. కానీ ఈ చెలియలి కట్టను తెగ్గొట్టాలా? దుఃఖాన్ని అవుపోసన పట్టాలా అని అనుకుంటున్నాను. తనవైపు వనలు చూడకుండా కాఫీ చేదును తాగుతున్నాను.

"మ్... ఓ నాల్రోజులు... ఆగవచ్చు గదా!" అంది.

నాకు అర్థమైంది. అదీ ఓ శకునంలా తోచింది. ఈ లోపల... ఎలా మందలించాలో తీరిగ్గా ఆలోచించవ చ్చనిపించింది.


* * * * *

నాలుగు రోజులు! యుగాలంటే ఇవే కాబోలు!

గబగబా నా ముందు కదుల్తున్న మనో దిగంతాలు!

మద్రాస్ హైకోర్టులో గుమాస్తాగిరి చేస్తున్నా అక్కడి జడ్జీలు, లాయర్లు మాత్రం 'మదువు మీ దూరవు బంధు వైనట్టుందే"అంటూ నవ్వేస్తుండేవారు.

వావిళ్ళ వారి దగ్గర పార్ట్ టైం చేస్తూ మేకప్‌ని షో చేసి గాలీ ప్రూఫ్ తీస్తుంటే... "ఇంద ప్రెస్‌దా మే డిన్ జర్మనీ. నీంగళ్ దా మే డిన్ రొంబ ఆంధ్రా సారూ... అవళదాం" అంటూ మెషీన్‌మన్



నవ్వేస్తుండేవాడు.

హైకోర్టు 'ఆర్డర్... ఆర్డర్' అంది. రిటైరయ్యాను. వావిళ్ళ ప్రెస్ కూడా అలాగే సేవలు చాలించుకుంది.

తాతగారి అరు అరకల పొలం తరాలు మారుతూ ఎలాగో తరిగిపోయింది. ఆ ఉన్నది కాస్తా... దొర పొగాకు- వత్తి విత్తనాలతో విల్లన్‌లాగా మెత్తగా నవ్వే అప్పుల పాలయింది. ఒంగోలు జాతి మా కోడె.. ఆర్టీసీ బస్సు ముఖం మీద బొమ్మగా మిగిలింది.

నేను ఇందుకూరుపేట వచ్చి ఉంటూ... నెల్లూరు పోతూ, వస్తూ... కల్యాణ మంటపం దగ్గర ప్రెస్‌లో లగ్న పత్రికల ప్రూఫులు దిద్దుతూ.... ఆ 'చెలిమి కీలు' తలుపులతో నా లేమిని ప్రేమిస్తూ....

దిగులు పడలేదు. వీటన్నింటికీ చలించవద్దంటూ భారతి ఎప్పుడో చెప్పి వెళ్ళిపోయింది. ఏ కవి నాలుక మీదనో కాసేపు కూచుని... ఆ పురుడు పోసి... మంచి ముద్దిస్తానంటూ.... ముద్దిచ్చినట్లే ఇచ్చి నోట మాట రానంత జ్ఞానం ఇచ్చి వెళ్ళింది.

అది.. అరుణనే 'ఈ పసిదానికి అదే విద్య అప్ప చెప్పమంది. అంది "ఇదుగో... ఈ తల్లిని నాలాగే చూసుకోండి. ఎప్పుడూ పేరు పెట్టి పిలవండి. వీ రొక్కరే పెంచడం కష్టమైతే.. నేనే మనుకోన్లే. మళ్ళీ... మళ్ళీ పెళ్ళి చేసుకోండి." అంది నవ్వుతూనే.

ఆ దుష్యంతుడు చూపులతోనే పెళ్ళాడిన ఓ ముని పిల్లని ఈ దేశపు పక్షులే పెంచ గలిగినపుడు నాకేం - అనుకున్నాను. నా మాటల మేనక మిగిల్చిన స్వప్నాన్ని పెంచుకున్నాను.

పాలు రాని నా బొటన వేలిని చీకుతుంటే దుఃఖంతో చీకిపోయాను. భుజాల మీద మార్చి మార్చి జోకొడుతూ చుక్కల చూపులతో సేద దీరాను. జడలు వేస్తూ ఏడాదులే మరిచి పోయాను.

ఆ రోజున... శాస్త్రాని కన్నట్టు చిమ్మిలి తింటూ భారతికి కేక వేసి చెప్ప బోయి... కొర బోయింది. 'రేపు మరో ఇంటికి పంపించ వలసి వస్తుంది గదా' అన్న దిగులుతో గొంతు పట్టుకుంది.

ఇపుడీ నా వేదన భారతికి వినిపిస్తుందా? వీళ్ళిద్దర్నీ మందలించడానికి రెండు, మూడు మాటలిస్తుందా?

* * * *

అతనికి ఉమ చేతనే కబురెట్టాను. వస్తూండవచ్చు. ఉమని గట్టిగా రావద్దని చెప్పాను. తనకి అర్థమై ఉండవచ్చు.

మిద్దె మీద వంచెలు ఆరేశాను. తీద్దామని ఎక్కాను. అనాలోచితంగా పెరటిలోకి చూశాను. కళ్ళు మూసుకున్నాను.

... అటు తిరిగి స్నానం చేస్తోంది.

అరుణని కనకముందు భారతి ఇలాగే ఉండేది.

కదల్లేక కాసేపు కూర్చున్నాను.

నా పెళ్ళి... భారతి కళ్ళూ కళ్ళల్లో మెదిలాయి.

లేచాను.

దూరంగా. అతనొస్తున్నాడు. మిద్దె మీద నున్న నన్ను చూళ్ళేదు. అబోతు లాంటి గాంభీర్యం - నంది లాంటి వినయం.

మిద్దె మీది పిట్ట గోడ నానుకుని నిలబడ్డాను. వంగి కిందకి చూశాను.

తలంటి స్నానం చేసి వచ్చిన అరుణ తడి జుట్టును విదిలించుకుంటూ అపాటికే నడవలో ఉంది. భుజాల మీదుగా తను కప్పుకున్న ఆ పల్చటి వోణీలో నా భారతి నదీ స్నానాలూ, వ్రతాలూ మెదిలాయి.

అతన్ని చూసిందా- లేదా - అని మళ్ళీ అతనివేపు దృష్టి సారించాను.

అతను ఇటే వస్తున్నాడు. వస్తున్న వాడల్లా ఆగి... ముక్కుమీద వద్దన్నట్టు వేలేసుకుని - అడ్డంగా తల ఊపి - అరక్షణం అసలు కదల్లేక పోయాడు.

అలా ఎందుకు ఆగిపోయాడా అని కిందికి చూశాను.

పైట తీసి.. మళ్ళీ వేసుకోవడానికి... కుడివైపు ఇంత దూరం సాచి... వేసుకోకుండా అతనివేపు చూసీ చూడకుండా... అలా... పట్టే ఉంచింది.

చిన్నపుడు పుట్టు మచ్చల్లాగే ఉన్నా... సూర్య చంద్రుల్లాంటి తన స్వంతచూపులతోనే ఎదిగి... రేవతి అమృతం కోసం బోర్లించుకున్న బంగారు గిన్నెల్లాగా..,

ఆ మట్టు అక్కడ ముట్టీ ముట్టగానే కరిగే లక్క ముక్కల్లాగా...

ఇంకా... ఆ దిగువన...

వాళ్ళమ్మ లేవ లేకుండా ఉన్న రోజుల్లో... కావాలను కున్నపుడల్లా నాకో చిరు నవ్వును అక్కడి నుండే తోడి ఇచ్చినట్టున్న... గంభీర నాభీ సరోజని.

అది వాళ్ళమ్మను గుర్తు చేసుకో మన్నట్టా? మా అమ్మను గుర్తు చేస్తున్నట్టా? లేక... రహస్యంగా ఇద్దర్నీ పలకరించ డానికి ఓసారి గట్టిగా కళ్ళు మూసుకో మన్నట్టా?

మూసుకున్నాను.

నిజమే! మా అమ్మ నా పెళ్ళపుడు 'చిరంజీవ' అన్నట్టూ, వాళ్ళమ్మ నా కౌగిలిలో ఆశీర్వదించమన్నట్టూ... అలా ఎంతసేపు ఆ పూర్వోత్తర కాలామృతాలు నా మనసుకి జీవం పోశాయో!

కాసే పయాక... మెట్ల మీదుగా మెల్లగా కిందికి దిగాను. మూడో మెట్టు మీదే వాకిట్లో అతను విడిచిన చెప్పుల జత పలకరించి అప్పటి కప్పుడే నాలో విపరీతమైన ఖుస తెప్పించింది.

నాలోని ఆ మగ కీచురాయిని ఆకురాతి పిడిలేని మొనతో పొడిచి... 'ఆలస్యం.. విషం - అమృతమ్' అని పెదాలతో అనిపించింది.

ఆ పాటికే లోపలి కెళ్ళాడన్న మాట! నా పడగ నీడన దాచుకున్న మణి లాంటి అరుణని ఏమీ చెయ్యడం లేదు గదా!

పాములాగేతల ఓరగా వంచి ఊపిరి బిగబట్టి వాకిట్లోనే ఉండి లోపలికి చూశాను.

అరుణ వెనకే తను ఉన్నట్టున్నాడు. అడ్డంగా నిలబడిన అరుణ వీపే కనిపిస్తోంది.

తడి జుట్టును ఎత్తుగా చుట్టి జారుముడి వేసుకోవడం వల్లనేమో.. మెడ ఇంత పొడవా అనిపిస్తోంది.

జాకెట్ మేరకు విడిగా కనపడుతున్న పచ్చటి ఆ చాయ... ఏదో పరున వేదికి అందిన మిస మిసలాగా మెరుస్తోంది.

ఆ పసుపు హంస పలకల మధ్య మెరుస్తున్న కుబుసం లాంటి వెన్నుపూస. ఎర్రటి పరికిణీ ఎత్తుల్లో మెల్లగా దిగి కదులుతున్నట్టే ఉంది.

తన... చేతులతో... అతన్ని... దా చు కుం టు న్న ట్టుం ది.

కళ్ళు మూసుకో బుద్ధి కాక... ఇటు తిరిగి నా వెనగ్గా తలుపు రెక్కలను నిశ్శబ్దంగా చేరవేసి కలిపాను. పక్కగా జరిగి... వణుకుతున్న చేతులతో కిటికీ గట్టు పట్టు చిక్కించుకున్నాను.

అమ్మయ్య! కిటికీ మూసే ఉంది. అయినా... ఎందుకో... ఆ గవాక్షానికి... ఓ... ఓ కన్నైనా లేదేమని ఆశగా వెతికాను.

ప్చ్...!

ఓ తల్లినైతే ఎంత బావుండేది!

ఇపుడు వాళ్ళిద్దర్నీ చూస్తూ తథాస్తు" అంటే... ఎంత తనివి తీరేది!

★

[వచ్చేవారం ప్రోత్సాహక బహుమతి పొందిన మరో కథ 'తిలదానం']

